క్లుప్తంగా

పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తనిఖీ



దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్ సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా గ్రామాల వారీగా చుక్కలు వేసిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేయించుకోని చిన్నారులకు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిరణ్‌రాజ్, హెచ్‌ఈఓ సాంబయ్య, ఫార్మాసిస్ట్ రమణ, స్టాఫ్‌నర్స్ సబిత, తదితరులు పాల్గొన్నారు.

పేద 'రెడ్డి'లకు చేయూత అందిస్తాం



నర్సంపేట : పేద రెడ్డి కులస్తులకు చేయూత అందిస్తామని వేమనరెడ్డి సంక్షేమ పరపతి సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, దాసరి నర్సింహారెడ్డి తెలిపారు. ఆ సంఘం ఆధ్వర్యంలో నర్సంపేట డివిజన్‌వ్యాప్తంగా రెడ్డి కులంలో వివిధ రంగాల్లో గుర్తింపు తెచ్చుకున్న ఆరుగురిని బాధ్యులు పట్టణంలోని గ్రీన్ రిసార్ట్‌లో ఆదివారం రాత్రి సన్మానించారు.

నివాళి

నెక్కొండ : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రావుల మధుకర్‌రెడ్డి కొడుకు అరవింద్‌రెడ్డి కారు ప్రమాదంలో మృతి చెందగా మృతదేహానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మధుకర్‌రెడ్డిని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీశ్‌రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్, నాయకులు సుబ్బారెడ్డి, కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, చల్లా శ్రీపాల్‌రెడ్డి, రాచకొండ రఘు, కుసుమ చెన్నకేశవులు, మాదాటి శ్రీనివాస్, తదితరులున్నారు.

సర్వాపురంలో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట పట్టణంలోని సర్వాపురం గ్రామానికి చెందిన వేముల శ్రీనివాస్‌రెడ్డి (45) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందగా ఆయన మృతదేహానికి నాల్గో వార్డు కౌన్సిలర్, బీజేపీ పార్టీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబుగౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు శీలం వీరన్నగౌడ్ సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు శీలం సత్యనారాయణ, శీలం ఎల్లగౌడ్, కందికొండ శ్రీనివాస్, సామల ప్రవీణ్, కందికొండ ప్రభాకర్, తోకల కుమార్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నెక్కొండ : మండలంలోని అలంకానిపేట గ్రామానికి చెందిన కొమ్ము రంజిత్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడితో కలిసి టెన్త్ చదువుకున్న చిన్ననాటి మిత్రులు సోమవారం రూ.30 వేల సాయం అందజేశారు. అనంతరం రంజిత్ కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్ నాయకుడి..

గీసుకొండ : మండలంలోని శాయంపేట హవేలీ గ్రామానికి చెందిన గాలి యాకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ప్రముఖ సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి సోమవారం రూ.5 వేల సాయం ప్రకటించారు. ఈ మేరకు ఆయన పంపించిన రూ.5 వేల నగదును ఆ పార్టీ స్థానిక నాయకులు అల్లం మర్రెడ్డి, చాడ కొమురారెడ్డి, తుమ్మనపెల్లి శ్రీనివాస్, సాయిలి ప్రభాకర్, ఆకుల రుద్రప్రసాద్, కందికొండ రాజ్‌కుమార్, దాడి శివ, రమేశ్, అశోక్, వీరయ్య, పైడి బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం యాకమ్మ కుటుంబాన్ని పరామర్శించారు.

విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ అందజేత



సంగెం : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన నూర సుహాసిని రమేశ్ సోమవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, తదితర మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్, ఉపాధ్యాయులు సుధాకర్, శ్యామ్‌కుమార్, ఆనంద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదల కోసమే 'ప్రజాపాలన' కేంద్రాలు



వర్ధన్నపేట : సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ



సంగెంలో..



నల్లబెల్లిలో..



పర్వతగిరిలో..



గీసుకొండ : దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీడీఓ

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసమే ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని ఎంపీపీ అన్నమనేని అప్పారావు తెలిపారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదలు సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు చక్కటి అవకాశమని చెప్పారు. ఎంపీడీఓ వెంకటరమణ మాట్లాడుతూ కొత్తగా దరఖాస్తులు స్వీకరించడంతోపాటు గతంలో చేసిన దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సవరిస్తామని తెలిపారు.

సంగెం : మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేవా కేంద్రాన్ని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను అర్హులకు అందించేందుకు ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, ఎంపీఓ కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండల పరిషత్ కార్యాలయంలో సేవా కేంద్రాన్ని ఎంపీడీఓ నర్సింహమూర్తి ప్రారంభించి మాట్లాడారు. సేవా కేంద్రంలో అందుతున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ కూచన ప్రకాశ్, సేవా కేంద్రం ఇన్‌చార్జులు గంగాధర్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల పరిషత్ కార్యాలయంలో సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా ఎంపీఓ పాక శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

గీసుకొండ : మండల పరిషత్ కార్యాలయంలో సేవా కేంద్రాన్ని ఎంపీడీఓ కృష్ణవేణి ప్రారంభించి మాట్లాడారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, కార్యాలయ సూపరింటెండెంట్ కమలాకర్, సీనియర్ అసిస్టెంట్ షాజహాన్, పి.శోభ, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడండి



బడ్జెట్ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే

- వరంగల్ అదనపు కలెక్టర్ అశ్విని తానాజీవాకడే
- మున్సిపల్ బడ్జెట్ సమావేశం

నర్సంపేట: నర్సంపేట మున్సిపాలిటీ పరిధి నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీవాకడే అధికారులకు సూచించారు. ఈమేరకు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్ అధ్యక్షతన సోమవారం మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీవాకడే మాట్లాడుతూ.. ప్రతీ రోజు పట్టణంలో ప్రజలందరికీ నీటి వసతి కల్పించడం, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జరిగిన బడ్జెట్ సమావేశంలో రూ.53.75 కోట్లు 2024–25 సంవత్సరం వార్షిక బడ్జెట్‌ను కౌన్సిలర్లు ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు రాయిడి కీర్తిదుశ్యంత్‌రెడ్డి, ఎండీ.పాషా, దార్ల రమాదేవి, వేముల సాంబయ్యగౌడ్, పెండెం లక్ష్మీరామానంద్, బత్తిని రాజేందర్, ములుకల వినోద, విజయ్‌కుమార్, ఓర్సు అంజలి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

14 మంది కౌన్సిలర్లు గైర్హాజరు

నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో 24 మంది కౌన్సిలర్లు ఉండగా.. నలుగురు కో–ఆప్షన్ సభ్యులున్నారు. సోమవారం జరిగిన బడ్జెట్ సమావేశానికి ఇటీవల అవిశ్వాస పత్రాన్ని అందించిన 14 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. కాగా.. 14మంది కౌన్సిలర్లలో ఐదుగురు కౌన్సిలర్లు బీజేపీలో చేరారు. వారు సైతం గైర్హాజరవడంతో సమావేశం జరుగుతుందా? రద్దవుతుందా అనేది చర్చకు దారితీసింది. అనంతరం మున్సిపాలిటీ అధికారులు చివరకు బడ్జెట్ బిల్లులను మాత్రమే ఆమోదించి ఇంకా జనరల్ ఫండ్‌తో పాటు డిపోకు సంబంధించి సుమారు రూ.35 కోట్ల నిధుల విషయం సమావేశంలో 24మందిలో 13మంది మెజార్టీ సభ్యులు ఉండి ఆమోదిస్తేనే బిల్లు పాస్ అవుతుందని, దాంతోనే జనరల్ ఫండ్‌తో పాటు డిపో నిధుల విషయమై సమావేశాన్ని అనంతరం నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జనరల్ ఫండ్ మూడున్నర కోట్ల నిధుల తాలూకు గత సమావేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్ల మధ్య నిధుల పంపకాల్లో తేడాలు రావడంతో అవి అలాగే మూలుగుతున్నాయి. మళ్లీ డిపో నిధులతో పాటు, జనరల్ ఫండ్ నిధులు సైతం అలాగే ఉంటున్నాయని వాటిని సత్వరమే మెజార్టీ సభ్యులు మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేసి పట్టణాభివృద్ధికి సహకరించేలా కౌన్సిలర్లు ఏకం కావాలని పలువురు కోరుతున్నారు.

9 నుంచి స్పెషల్ డ్రైవ్



నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ధరణి పోర్టల్ కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి ఈనెల 9 నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తహసీల్దార్ వేముల రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో పలువురు రైతుల నుంచి సోమవారం ఆయన దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. మండలంలో భూసమస్యల పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి దరఖాస్తులను నమోదు చేసుకుని పరిశీలిస్తామన్నారు. గ్రామాల పరిధిలో ధరణి మాడ్యూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, ఆర్‌ఐ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సోషల్ ఆడిట్

దుగ్గొండి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులు, ఖర్చు చేసిన నిధులపై నేటి (మంగళవారం) నుంచి సామాజిక కార్యకర్తలు సోషల్ ఆడిట్ చేయడానికి సిద్ధం అయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలోని రికార్డులను సోమవారం స్వాధీనం చేసుకున్నారు. రికార్డుల ఆధారంగా సామాజిక కార్యకర్తలు గ్రామాల్లో పర్యటిస్తారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31 వరకు మండలంలో రూ.4.98 కోట్ల విలువైన పనులు జరగ్గా రూ.4.78 కోట్ల విలువైన కూలీల, రూ.20 లక్షల విలువైన మెటీరియల్ పనులు జరిగాయి. వీటిపై సోషల్ ఆడిట్ కార్యకర్తలు వారం రోజులపాటు గ్రామాల్లోని పని ప్రదేశాలను పరిశీలించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పర్వతగిరి : మండలంలోని రెడ్లవాడ, ధూపతండా, చౌటపల్లి విలేజ్, చింతనెక్కొండ ఇండస్ట్రీయల్ ఫీడర్ల పరిధిలో నేడు (మంగళవారం) ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్న కారణంగా ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

వర్ధన్నపేట : పట్టణంలో కొనసాగుతున్న శ్రీచైతన్య, అరబిందో ఉన్నత పాఠశాల పేర్లు రెండు ఉండడంతో అయోమయంగా ఉందని, నిబంధనలను అతిక్రమించి పాఠశాల నిర్వహిస్తున్నారని తెలుపుతూ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర కార్యదర్శి ఈరెల్లి శ్రీనివాస్ సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని శ్రీచైతన్య, అరబిందో పేర్లపైన పాఠశాల ఉండడం అయోమయంగా ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేయడంతోపాటు పాఠశాలలోనే పుస్తకాలు విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నర్సంపేట : రెండో విడత పంపిణీని గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. అనంతరం మధుకర్ మాట్లాడారు. నియోజకవర్గంలో వేలాది మంది గొల్ల కురుమలు డీడీలు తీసి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు గొర్రెలు పంపిణీ చేయలేదని ఆందోళన వెలిబుచ్చారు. డీడీలు తీసేందుకు గొల్ల కురుమలు అప్పులు చేయాల్సి వచ్చిందని చెప్పారు. చేసిన అప్పుకు వడ్డీ పెరుగుతుండగా గొర్రెలు మాత్రము అందడం లేదన్నారు. పలుమార్లు అధికారులను కలిసినా ప్రయోజనం లేకపోగా డీడీలు ఇచ్చిన వ్యక్తులు దరఖాస్తు చేసుకుంటే డబ్బు తిరిగి ఇస్తామని చెబుతున్నారని తెలిపారు. డబ్బులు తిరిగి ఇస్తే గొల్ల కురుమలు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ మేరకు రెండో విడత మిగిలిన గొల్ల కురుమలకు రూ.2 లక్షలు చొప్పున నగదు బదిలీ ద్వారా పథకాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు జక్క రవి, నాంచారి కుమారస్వామి, బాషబోయిన శ్రీను, జక్క వెంకన్న, ఆవుల రాములు, తోటకూరి రాజయ్య, వల్లె రవి, తొగరు కుమార్, బత్తిని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలీలోని వేణుగోపాలస్వామి ఆలయ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా బొమ్మినేని నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడుగా తాప్సారపు రాజు, ప్రధాన కార్యదర్శిగా అక్కెల్లి శ్రీరాం, కోశాధికారిగా బూర సతీశ్, సహాయ కార్యదర్శిగా గారంపెల్లి తిరుపతి, సభ్యులుగా చొక్కా శ్రీను, గట్ల భిక్షపతి ఎన్నికయ్యారు. ఈ మేరకు కమిటీని ఎంపీపీ భీమగాని సౌజన్య ప్రకటించారు.

శివాలయం కమిటీ..

గ్రామంలోని శివాలయ కమిటీ అధ్యక్షుడుగా బీమగాని రామచంద్రగౌడ్, ఉపాధ్యక్షుడుగా కమలాపురం రాజు, ప్రధాన కార్యదర్శిగా బొడిగె సదానందం, కోశాధికారిగా గాదం శ్యాం ఎన్నికయ్యారు. ఈ మేరకు కమిటీని ఎంపీపీ సౌజన్య ప్రకటించారు. కార్యక్రమంలో అర్చకులు భాగవతుల మోహనశర్మ, పురుషోత్తమాచార్యులు, సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న రాంబాబుగౌడ్

పర్వతగిరి : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు జన్మదినం సందర్భంగా మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో సుమారు 400 మందికి ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన వంగ రాంబాబుగౌడ్ సోమవారం అన్నదానం చేశారు. అలాగే మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, ఏనుగల్‌లో నాయకులు కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ రతన్‌రావు, మాజీ సర్పంచ్ భిక్షపతి, నాయకులు బొంపెల్లి దేవేందర్‌రావు, తొర్రి పద్మ, రాపోలు రవీందర్, గొడుగు వినయ్, ఇరగని అఖిల్, మోహన్, ఇరగని మధు, జక్కల వెంకన్న, గాడిపెల్లి రాజబాబు, జక్కుల వెంకన్న, గాడిపెల్లి మహేందర్, ముంజంపల్లి రాములు, గాడిపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి అభినందన



ఎస్సైకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీటీసీలు

సంగెం : స్థానిక ఎస్సై ఎల్.నరేశ్‌ను ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు రంగరాజు నర్సింహస్వామి అభినందించారు. ఆయన ఆధ్వర్యంలో ఎంపీటీసీలు ఎస్సై నరేశ్‌ను పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎస్సైతో నర్సింహస్వామి మాట్లాడారు. ఎస్సైని కలిసిన వారిలో ఎంపీటీసీలు మెట్టుపల్లి మల్లయ్య, దుర్గారావు, గుగులోత్ వీరమ్మ గోపీసింగ్, నాయకులు శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, యుగేందర్, రాజు, నరేశ్, రవి, భిక్షపతి, మన్సూర్ అలీ తదితరులున్నారు.

పాఠశాలలో నోడల్ ఆఫీసర్ విచారణ

సాక్షి ఎఫెక్ట్..



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ సుమన్‌తేజ

రాయపర్తి : 'విధుల్లో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం' శీర్షికతో ఈనెల 2న ప్రచురితమైన 'సాక్షి' కథనానికి స్పందన లభించింది. మండలంలోని తెట్టకుంటతండా ప్రాథమిక పాఠశాలను నోడల్ ఆఫీసర్ సుమన్‌తేజ సోమవారం సందర్శించి విచారణ చేపట్టారు. సమయపాలన పాటించని విషయమై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. చదువుల్లో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం కొండూరు, తిర్మలాయపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఆర్థికాభివృద్ధితో జీవితంలో ఉన్నతి



పాలిషింగ్ యంత్రాన్ని అందజేస్తున్న ఏజీఎం రవి

ఖానాపురం : ఆర్థికాభివృద్ధితోనే జీవితంలో ఉన్నతి సాధించగలరని నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) రవితంగ తెలిపారు. మండలంలోని రాగంపేట రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో శారీ, పెట్టికోట్, బ్లౌజ్ డిజైన్ మేకింగ్‌పై శిక్షణ ఇప్పించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సంఘానికి స్పైసెస్ బోర్డు నుంచి సబ్సిడీపై మంజూరైన పసుపు బాయిలర్, పాలిషర్ యంత్రాన్ని సోమవారం ఏజీఎం అందజేసి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. మహిళా రైతులు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం నుంచి సబ్సిడీలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం సీఈఓ మౌనిక, డైరెక్టర్లు జ్యోతి, శ్రీలత, రంగు కవిత, సాయి స్వచ్ఛంద సంస్థ సీఈఓ వెంకన్న, ప్రోగ్రాం మేనేజర్ శిరీశ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో మాజీ జెడ్పీటీసీ చేరిక



దీపాదాస్ మున్షీకి పూలబొకే అందిస్తున్న మాజీ జెడ్పీటీసీ సారంగపాణి

వర్ధన్నపేట : స్థానిక మాజీ జెడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి దంపతులతోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆధ్వర్యంలో టీపీసీసీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో సోమవారం చేరారు. పాలకుర్తి సారంగపాణి తెలంగాణ ఆవిర్భావం తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరి జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. ఆయన సతీమణి సుజాత వార్డు కౌన్సిలర్‌గా గెలిచారు. పదేళ్ల తర్వాత సారంగపాణి దంపతులు మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. సారంగపాణి వెంట కాంగ్రెస్‌లో చేరిన వారిలో నాయకులు పిన్నింటి వెంకటేశ్వర్‌రావు, బక్కతట్ల రాజు, పూజారి శ్రీనివాస్, బక్కతట్ల శ్రీనివాస్, ఆంగోతు శ్రీనివాస్, ఆంగోతు వీరన్న, తదితరులుండగా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, నాయకులు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, అబ్బిడి రాజిరెడ్డి, నూనావత్ భీమానాయక్, సోము, సురేశ్, జాటోతు రమేశ్, బానోతు భిక్షపతి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న రాగసుధ

నర్సంపేట : ప్రజలను చైతన్యవంతం చేసి ఉద్యమాలు ఉధృతం చేయడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించగలమని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ స్పష్టం చేశారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో కుక్కల యాకయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో రాగసుధ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వినాశకర విధానాలతో దేశీయ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ ఉత్పత్తిలో కీలకమైన రైతులపై ఉక్కుపాదం మోపుతోందని విమర్శించారు. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి ప్రశ్నించి పోరాడే హక్కులు లేకుండా నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని మండిపడ్డారు. హామీలను అమలు చేయకపోగా కాల్పులు చేయించి రైతుల హత్యకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రజాసమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా ఉద్యమాలు నిర్మించాలని చెప్పారు. నర్సంపేట అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి వెనుకబడిన వాడలను అభివృద్ధి చేయాలని, ప్రత్యేక చొరవతో ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు ఈర్ల రాజు, పట్టల యాకయ్య, శామంతుల రతన్, కసుబాల సతీశ్, బెజ్జంకి రాజేశ్, గడ్డం కొమ్మాలు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ బలోపేతానికి కృషి



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సంపత్‌కుమార్

నర్సంపేట : ఉమ్మడి వరంగల్ జిల్లాలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) బలోపేతానికి కృషి చేస్తామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా అధ్యక్షుడు ద్యాగల శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలంలోని కాలేజీ ఆఫ్ టెక్నాలజీ ఆడిటోరియంలో రాష్ట్ర అధ్యక్షుడు ఐలినేని శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు ద్యాగల శ్రీనివాస్‌ను జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పి.సంపత్‌కుమార్ షీల్డ్, మెమొంటో అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. కౌన్సిల్ సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు సామాన్యులకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కమిటీలు వేసి బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ములుగు జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నాగరాజు, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నూరి రవికుమార్, జిల్లా కార్యదర్శి పసుల అశోక్‌కుమార్, జిల్లా యూత్ వింగ్ కన్వీనర్ కొడకండ్ల శ్యామ్‌సుందర్, నర్సంపేట పట్టణ మహిళా అధ్యక్షురాలు మోడెం మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రఘుపతి



రాయపర్తి : కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని కొండూరుకు గుండె రఘుపతి నియమితులయ్యారు. మండల కేంద్రంలో ఆయన సోమవారం మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు నగరగిరి ప్రీతం, జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య నుంచి నియామక పత్రం అందుకున్నట్లు తెలిపారు. తనకు పదవి రావడంలో సహకరించిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.